క్లుప్తంగా

సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

తుని రూరల్: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో జూన్ నెలకు సంబంధించి సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో 12,427 మంది పింఛను లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరందరికీ రూ.3,67,56,000 అందజేయాల్సి ఉందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో గడపదాటి బయటకు రాలేని 3397 మంది వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే పంచాయతీ కార్యదర్శులు వెళ్లి పింఛన్ మొత్తాన్ని రూ.96.66 లక్షలు అందజేస్తారన్నారు. మిగిలిన 9030 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు రూ.2,70,90,000 మొత్తాన్ని డీబీటీ ద్వారా జమ చేస్తామన్నారు. ఇప్పటికే మండలంలోని 27 సచివాలయాల కార్యదర్శుల ఖాతాలకు నగదు సర్దుబాటు చేశామని వివరించారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



ప్రత్తిపాడులో పతాకాన్ని ఆవిష్కరించి ఐక్యత చాటుతున్న సీఐటీయూ నాయకులు

ప్రత్తిపాడు: కార్మికుల హక్కులు, పనిభద్రత కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు అన్నారు. స్థానిక లారీ వర్కర్స్ కార్యాలయం వద్ద గురువారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ పతాకాన్ని లారీ వర్కర్స్ యూనియన్ నాయకుడు భూసాల శ్రీను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చే విధానాన్ని కార్మికులు తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంస్థల నాయకులు అల్లాడి లక్ష్మి, ఎ.అన్నపూర్ణ, కె.సతీష్‌కుమార్, ఎస్.సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు తావు లేకుండా చర్యలు


అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ రాజేశ్వరరావు

కిర్లంపూడి: వచ్చే నెల 4న జరిగే ఓట్ల లెక్కింపును దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ఘర్షణలు, అల్లర్లకు తావు లేకుండా గ్రామస్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందు జాగ్రత్తగా ప్రజలకు చట్టాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కౌటింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై-2 బలరాం, పంచాయతీ విస్తరణ అధికారి సత్య ప్రసాద్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యవర ప్రసాద్, కార్యదర్శులు, వీర్వోలు పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్ ప్లాంట్ పరిశీలన


సామర్లకోట ఫిల్టర్ బెడ్ ప్లాంటును పరిశీలించిన కమిషనర్ రామారావు

సామర్లకోట: పట్టణ ప్రజలకు తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్ ప్లాంటును మున్సిపల్ కమిషనర్ జె.రామారావు గురువారం పరిశీలించారు. స్థానిక ఉండూరు రైల్వే గేటు సమీపంలోని ఫిల్టర్ బెడ్ ప్లాంటు నుంచి నీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. కొన్ని రోజులుగా కుళాయిల నుంచి తాగునీరు పసరు రంగులో వస్తోందనే ఫిర్యాదుల మేరకు నిత్యం ఫిల్టర్ బెడ్ ప్లాటును పరిశీలిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ మేరకు ఫిల్టర్ చెరువు నుంచి క్లారిఫాక్యులేటర్ లోనికి వచ్చిన నీటిని, అక్కడి నుంచి ఫిల్టర్ బెడ్‌లో నీరు శుద్ధి అవుతున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ప్రజలకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్న నీటిని ఆయన పరిశీలించారు.


తహసీల్దార్ ఆదేశాలు బేఖాతరు చేస్తూ మట్టి తవ్వకాలు

ఎగుమతి కేంద్రాలు.. ఉపాధికి నిలయాలు

- బెండపూడి కేంద్రంగా ఇతర రాష్ట్రాలకు మామిడి ఎగుమతులు
- ఉపాధి పొందుతున్న కూలీలు
- ప్రతికూల వాతావరణంతో తగ్గిన దిగుబడులు
- గతేడాదితో పొలిస్తే మామిడి ధరలు రెట్టింపు


బెండపూడిలో మామిడికాయలను ఎగుమతి చేసేందుకు గ్రేడింగ్ చేస్తున్న కూలీలు


ఎగుమతి కోసం సిద్ధం చేసిన బంగినపల్లి మామిడికాయలు

తొండంగి: వేసవి వచ్చిందంటే చాలు మధుర ఫలాలు మామిడి పండ్లు సందడి నెలకుంటుంది. చిన్నపిల్లల నుంచి పండు ముసలి వరకూ ప్రతిఒక్కరూ మామిడి పండ్లను ఎంతో ఇష్టంగా తింటారు. మెట్ట ప్రాంతమైన తుని, పత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల నుంచి ఇతర రాష్ట్రాలకు మామిడి కాయలు, పండ్లను ఎగుమతి చేస్తున్నారు. మామిడి ఎగుమతి కేంద్రాల ద్వారా కూలీలకు ఉపాధి దొరకుతోంది. ఈ ఏడాది ప్రతికూల వాతావరణం కారణంగా మామిడి దిగుబడి తగ్గిపోయింది. దీంతో మామిడి కాయలు, పండ్లకు మార్కెట్లో గిరాకి బాగా పెరిగింది. గతేడాది కంటే ఈఏడాది రెట్టింపు ధరలు పలుకుతున్నాయి.

3 వేల ఎకరాల్లో సాగు

తొండంగి మండలంలోని మెట్ట గ్రామాలైన బెండపూడితో పాటు, రావికంపాడు, పి.ఇ.చిన్నాయపాలెం, ఎ.కొత్తపల్లి, కొమ్మనాపల్లి, సీతారాంపురం, కృష్ణాపురం, గోపాలపట్నం, పైడికొండ, పి.అగ్రహారం, శృంగవృక్షం తదితర గ్రామాలతో పాటు కోన గ్రామాలల్లో సుమారు 3 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఉండటంతో తొండంగి మండలంతో పాటు శంఖవరం, రౌతులపూడి మండలాల నుంచి వచ్చే మామిడి కాయలను బెండపూడి కేంద్రంగా ఎగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా బంగినపల్లి, రసాలు, కొత్తపల్లి కొబ్బరి, సువర్ణ రేఖ, పంచదార కంచి, చిన్న రసాలు, పెద్ద రసాలు, చెరకు రసాలు, కలెక్టరు, దసేరి, కొండమామిడి తదితర రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ఆయా రకాల్లో నాణ్యమైన కాయలను గ్రేడింగ్ చేసి రాష్ట్రంలోని విశాఖ, విజయవాడ, నెల్లూరు, గుంటూరు, ఇచ్ఛాపురం, రాయలసీమ వంటి ప్రాంతాలతో పాటు పశ్చిమబెంగాల్, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఎగుమతులతో ఉపాధి

వేసవిలో గ్రామీణ ప్రాంత ప్రజలకు మామిడి కాయల ఎగుమతుల కేంద్రాలు ఉపాధికి నిలయాలుగా మారాయి. బెండపూడిలో దాదాపు పది వరకూ మామిడి ఎగుమితి కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో 20 నుంచి 30 మంది వరకూ కూలీలు పని చేస్తున్నారు. వీరికి రోజులకు రూ.500 నుంచి వె రూ.1000 వరకూ కూలి గిట్టుబాటు అవుతోంది. మామిడి ఎగుమతి కేంద్రాల ద్వారా ఏటా వేసవిలో రెండు నుంచి మూడు నెలల పాటు ఉపాధి దొరుకుతుందని కూలీలు తెలిపారు.

ప్రతికూల వాతావరణం నేపథ్యంలో ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గడంతో ధర బాగుంది. గతేడాది కంటే ఈ ఏడాది రికార్డు స్థాయి ధర పలుకుతోందని హోల్‌సేల్ వ్యాపారులు తెలిపారు. గతేడాది టన్ను మామిడి కాయల ధర రూ.12 నుంచి రూ.15 వేల వరకూ ఉండగా ఈ ఏడాది రూ.30 వేలకు పైగా పలుకుతోంది. మామిడి ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో సామాన్యులకు మధుర ఫలాలు అందని ద్రాక్షగా మారుతున్నాయి. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు మామిడి పండ్లను కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.


ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు వాహనాల్లో మామిడికాయల ట్రేలను లోడింగ్ చేస్తున్న దృశ్యం

ఉపాధి లభిస్తోంది


మాది బెండపూడి గ్రామం. ఏటా వేసవిలో మామిడి ఎగుమతి కేంద్రంలో మామిడి కాయలను గ్రేడింగ్ చేస్తారు. రోజుకు రూ.500 వరకూ కూలీ వస్తుంది. రెండు నెలల పాటు మాకు ఉపాధి లభిస్తుంది.

– ఎ.అరుణ, కూలీ, బెండపూడి

టన్ను ధర రూ.30 వేల పైమాటే


మెట్ట ప్రాంతంలో పండిన బంగినపల్లి మామిడి పండ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. గతేడాది టన్ను ధర రూ.15 వేల లోపు ఉంటే ఈ ఏడాది రూ.30 వేలకు పైగా పలుకుతోంది. ధర అధికంగా ఉండటంతో సామాన్యులు మామిడి పండ్లను కొనలేని పరిస్థితి నెలకొంది. నిర్వహణ ఖర్చులు పెరగడంతో మార్జిన్లు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి.

– నాగనబోయిన తలపులబ్బాయి, హోల్‌సేల్ వ్యాపారి, బెండపూడి

సహజసిద్ధంగా పండిన పండ్లతో ఆరోగ్యం


మామిడి పండ్లలో పలు రకాల విటమిన్లతో పాటు ఖనిజాలు, పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. సీజన్‌లో సహజ సిద్ధంగా పండిన మామిడి పండ్లను తింటే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. రసాయనాలతో మాగబెట్టిన మామిడి పండ్లను తినకపోవడం మంచిది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనలు, సలహాల మేరకు మామిడి పండ్లు తీసుకోవాలి.

– పి.రవికుమార్, సీనియర్ వైద్యుడు, ఏవీ నగరం పీహెచ్‌సీ

పుస్తక పఠనంపై అవగాహన


ఏలేశ్వరం గ్రంథాలయంలో పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు ప్రసాద్

ఏలేశ్వరం: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఏబీవీ ప్రసాద్ విద్యార్థులకు పుస్తక పఠనంలో మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలన్నారు. ప్రతిరోజు పుస్తక పఠనం చేస్తే జ్ఞాపకశక్తి, మేధాశక్తి పెరుగుతాయన్నారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న నాయకులు

గోకవరం: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం గోకవరం హన్నా కళాశాలలో గురువారం ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కళాశాల చైర్మన్ డాక్టర్ బొడ్డు సువర్ణకుమార్, స్థానిక నాయకులు దొడ్డా విజయ్‌భాస్కర్, రాయవరపు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కాకినాడ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు నిర్వహించిన ఈ రక్తదాన శిబిరానికి ప్రజల వద్ద నుంచి విశేష స్పందన లభించింది. 20 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో చీకట్ల రాజు, చోడిశెట్టి గోపీ, పసుమర్తి మరిడిరాజు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం


ప్రత్తిపాడులో అగ్నిమాపక భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సునీల్‌కుమార్


ప్రత్తిపాడులో నూతనంగా నిర్మించిన అగ్నిమాపక కేంద్రం భవనం

- ఎట్టకేలకు పూర్తయిన అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణం
- ప్రారంభించిన అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్ సునీల్ కుమార్

ప్రత్తిపాడు: దశాబ్దాల కల సాకారమైంది. గ్రామంలో అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణం ఎట్టకేలకు పూర్తయ్యింది. ఈ భవనాన్ని గురువారం రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పీవీ సునీల్‌కుమార్ ప్రారంభించారు. దీంతో ఐదు దశాబ్దాలుగా శిథిల భవనంలో కొనసాగుతున్న అగ్నిమాపక కేంద్రానికి పక్కా భవనం సమకూరింది.

1981లో...

ప్రత్తిపాడులో 1981 డిసెంబర్ నెలలో అప్పటి ఎమ్మెల్యే ముద్రగడ పద్మనాభం తన సొంత సొమ్ములతో రెండెకరాల స్థలాన్ని కొనుగోలు చేసి అగ్నిమాపక కేంద్రాన్ని నిర్మించారు. దానిని పూర్తి స్థాయి అగ్నిమాపక కేంద్రంగా తీర్చిదిద్దారు. 1983లో సంభవించిన తుపానుకు షెడ్డు కూలిపోవడంతో అగ్నిమాపక శకటం పాక్షికంగా దెబ్బతింది. తిరిగి దీనిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా ఉన్న ముద్రగడ 1985లో జాతీయ గ్రామీణ ఉపాధి కల్పనా పథకం నిధులతో పునర్నిర్మాణం చేపట్టారు. ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రం భవనం పూర్తిగా శిథిలస్థితికి చేరుకోవడంతో అగ్నిమాపక విపత్తుల శాఖ రూ.70 లక్షల నిధులను మంజూరు చేసింది. దీని నిర్మాణానికి 2019 జనవరి 12న అప్పటి ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి దీని నిర్మాణం సాగుతూ వస్తోంది. ఇటీవల కాకినాడ కోరమాండల్ ఇంటర్ నేషనల్ లిమిటెడ్ సీఎస్ఆర్ గ్రాంట్ నుంచి రూ.లక్షల విరాళం అందించడంతో నిర్మాణం పూర్తయ్యింది. ర్యాంప్ వంటి చిన్న చిన్న పనులు మిగిలిఉన్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అగ్నిమాపక శాఖ ఈ నూతన భవనాన్ని రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పీవీ సునీల్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కోరమాండల్ లిమిటెడ్ కాకినాడ విభాగం అధిపతి సీహెచ్ శ్రీనివాసరావును డైరెక్టర్ జనరల్ సునీల్‌కుమార్, ఇతర అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ పీవీ రమణ, రీజినల్ ఫైర్ ఆఫీసర్ స్వామి, కాకినాడ జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్.సురేంద్ర ఆనంద్, ఏడీఎఫ్‌ఓలు ఎం.శ్రీహరి, జగన్నాథ్, వి. సుబ్బారావు పాల్గొన్నారు.

వివాదాలకు పాల్పడవద్దు

ప్రత్తిపాడు: గ్రామాల్లో ప్రతి చిన్న విషయానికి క్షణికావేశాలకు పోయి వివాదాలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని ట్రైనీ డీఎస్పీ ఈశ్వరరావు సూచించారు. మండలంలోని పెదశంకర్లపూడి గ్రామస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెలువడే సమయంలో ప్రజలు పంతాలకు పోకూడదన్నారు. బెట్టింగులకు పాల్పడితే దండన తప్పదని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో 144, పోలీసు యాక్టు 30 సెక్షన్లు అమలులో ఉన్నాయన్నారు. ప్రజలు నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడి ఉండరాదన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పెదశంకర్లపూడిలో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ ఈశ్వరరావు

సీజనల్ వ్యాధులపై అవగాహన

శంఖవరం: సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ సూచించారు. మండలంలోని కొత్తూరులో ప్రజలకు గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూటే కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదని, లక్షణాలకనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్ల లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. దోమల నియంత్రణకు దోమల తెరలు ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


కొత్తూరులో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

కౌంటింగ్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలి

గోకవరం: ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ ఇంచార్జి డిప్యూటీ కలెక్టర్ ఏఎన్ఆర్ మూర్తి సూచించారు. గోకవరం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఎన్నికల సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పెట్రోల్ బంకులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పెట్రోల్ బంకుల్లో లూజు విక్రయాలు నిర్వహించకూడదన్నారు. అలాగే అనుమతులు లేకుండా బాణాసంచా నిల్వ చేయకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రజని, ఎస్సై కె.నాగరాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



గోకవరం పెట్రోల్ బంకులో తనిఖీలు చేస్తున్న మూర్తి, అధికారులు

తాగునీటికి కొంగజపం


ధర్మవరం రామభద్రరాజు చెరువులో దాహం తీర్చుకోవడానికి పోటీ పడుతున్న కొంగలు

ప్రత్తిపాడు రూరల్: ప్రస్తుత వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. వారం రోజులుగా నియోజకవర్గంలో భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు అత్యవసర పనులు ఉంటే మినహా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇక పశువులు, పక్షులు అయితే ఎండకు అల్లాడి పోతున్నాయి. ఒక పక్క ఎండ తీవ్రత, మరో పక్క తాగునీటి కొరతతో పడరాని పాట్లు పడుతున్నాయి. ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో అడుగంటిన రామభద్రరాజు చెరువులో తాగునీటి కోసం కొంగలు అల్లాడుతున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. అడుగంటిన చెరువులో ఉన్న కొద్దిపాటి నీళ్లు సైతం ఎండ తీవ్రతకు వేడెక్కిపోయాయి. ఆ నీటినే తాగేందుకు కొంగలు పోటీ పడ్డాయి. ప్రస్తుత వేసవిలో తాగునీటికి పశువులు, పక్షులు పడుతన్న అవస్థలకు ఈ చిత్రం అద్దం పడుతోంది.


రామభద్రరాజు చెరువులో పూర్తిగా అడుగంటిన జలాలు

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన బత్తిన వీరబాబు తన మొదటి భార్యకు దూరమై రెండో పెళ్లి చేసుకుందామని ప్రయత్నాలు చేసినా ఫలించకపోవడంతో గడ్డి మందు తాగి మృతి చెందినట్టు గండేపల్లి ఏఎస్ఐ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. బత్తిన వీరబాబుకు గతంలో పెళ్లి కాగా కొద్ది సంవత్సరాల క్రితం భార్య వదిలేసింది. అప్పటి నుంచి మరో పెళ్లి చేసుకుందామని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 29న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో డాక్టర్లు కాకినాడ జీజీహెచ్‌కు తరలించాలని సూచించారు. జీజీహెచ్‌కు బుధవారం అర్ధరాత్రి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర

సామర్లకోట: హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రసన్నాంజనేయ ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడి భజన, కోలాటం, శ్రీరామ నామజపంతో శోభాయాత్ర జరుగుతుందన్నారు. పట్టణ పురవీధుల గుండా పాదయాత్రతో శోభాయాత్ర ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత బైక్ ర్యాలీతో భారీ ఎత్తున శోభాయాత్ర ఉంటుందన్నారు.

తహసీల్దార్ ఆదేశాలు బేఖాతరు

- యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- అడ్డుకున్న వీఆర్వోపై డ్రైవర్ దాడి

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు గ్రామంలోని పొలాల నుంచి యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. దీనిపై గతంలో మేడపాడు గ్రామానికి చెందిన నాయకులు తహసీల్దార్ వై.శ్రీనివాసుకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు తవ్వకాలను నిలువరించారు. మళ్లీ రెండు రోజులుగా తిరిగి తవ్వకాలు ప్రారంభించారని వైఎస్సార్ సీపీ నాయకుడు గోలి బాబ్జీ ఫిర్యాదు చేయడంతో వీఆర్వో కామరాజు పరిశీలించి పొలంలోని టిప్పర్లను బయటకు తరలించారు. కాగా మట్టితో వెళ్తున్న మరో టిప్పర్‌ను అడ్డగించిన వీఆర్వో నూతలపాటి లోవరాజుపై టిప్పర్ డ్రైవర్ దౌర్జన్యానికి దిగాడు. జి.మేడపాడులో మట్టిలోడ్‌తో టిప్పర్లు రాక పోకలు సాగించడం వల్ల దాత సహకారంతో నిర్మించిన వంతెన పాడై పోతుందని ఆ గ్రామ రైతు సంఘ నాయకుడు పుట్టా బుజ్జిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మామూళ్లు అందడం వల్లే మట్టితవ్వకాలు సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అడుగంటిన తాండవ జలాలు


కుమ్మరిలోవ సమీపంలో ఇసుక దిబ్బలతో మైదానాన్ని తలపిస్తున్న తాండవ నది


తాండవ మినీ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు అడుగంటడంతో దర్శనమిస్తున్న బండరాళ్లు

- ఇసుక దిబ్బలతో దర్శనమిస్తున్న నదీ పరివాహకం
- ఈ ఏడాది వర్షాలు కురిస్తేనే ఆయకట్టుకు నీరు

తుని రూరల్: తాండవ నదీ జలాలు అడుగంటడంతో నదీ పరివాహక ప్రాంతం రాళ్లు, ఇసుక దిబ్బలతో మైదానాన్ని తలపిస్తోంది. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సమ్మచింత సమీపంలో తాండవ రిజర్వాయర్ ఉంది. అక్కడ నుంచి కాకినాడ జిల్లా రౌతులపూడి, కోటనందూరు, తుని, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మీదుగా పెంటకోట వద్ద సముద్రం వరకూ 40 కిలో మీటర్ల మేర తాండవ నది ప్రవహిస్తోంది. తుపాన్లు, వరదలు సంభవించినప్పుడు తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. అలాగే తాండవ నదిపై కోటనందూరు వద్ద గ్రోయిన్, తునికి ఎగువన, దిగువన రెండు మినీ రిజర్వాయర్లు ఉన్నాయి. గ్రోయిన్, మినీ రిజర్వాయర్ల ద్వారా కోటనందూరు, తుని, పాయకరావుపేట మండలాల్లో 20 వేల ఎకరాలకు తాండవ జలాశయం నుంచి సాగునీరు అందుతుంది. గతేడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, రిజర్వాయర్‌లో నీటి నిల్వలు అంతంతగానే ఉండడంతో నదిలోకి నీరు విడదల చేయలేదు. దీంతో తాండవ నది చుక్క నీరు లేకుండా ఎండిపోయింది. మినీ రిజర్వాయర్లలో సైతం నీటి నిల్వలు అడుగంటడంతో బండరాళ్లు దర్శనమిస్తున్నాయి. ఈ సంవత్సరం తొలకరిలో వర్షాలు కురిస్తేనే రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు నీరు విడుదల చేసే పరిస్థితి నెలకొంది.